

# కథ

## దానం ఉమాదేవి

# ఆల్ ఇన్ వన్

''సురేఖా పాపను రెడీ చేశావా'' వరండాలోనుండే కేకేశాడు వరుణ్.

''శ్రీజ స్కూలుకు వెళ్ళనని మారాం చేస్తున్నది. కాస్త వెయిట్ చేయండి. బుజ్జగించి పంపిస్తాను'' బతిమాలుతున్నట్లుగా జవాబిచ్చింది సురేఖ.

''ఈరోజు ఆఫీసుకు త్వరగా వెళ్ళాలి. తరువాత నువ్వు దింపెయ్యి స్కూల్లో'' అంటూ భార్య సమాధానం కోసం ఎదురుచూడకుండా బయటికి నడిచాడు వరుణ్.

ఏదో చెప్పబోయిన సురేఖ బయట స్కూటర్ స్టార్ట్ అయిన శబ్దం విని 'హూ' అని నిట్టూర్చింది. తానెళ్ళి దించితే తనతోపాటే తిరిగి వస్తానని పేచీ పెడుతుంది శ్రీజ.

వరుణ్-సురేఖల ఏకైక సంతానం శ్రీజ. ఎల్.కె.జి. చదువుతున్న ఐదేళ్ళ శ్రీజను బుజ్జగించి స్కూలుకు పంపేసరికి సురేఖ తలప్రాణం తోకకు వస్తుంది.

సురేఖ అత్తగారు అన్నపూర్ణమ్మ పల్లెనుండి కొడుకు దగ్గరికి వచ్చినప్పుడల్లా కొడుకు, కోడల్ని మందలిస్తూనే వుంటుంది.

''నిండా అయిదేళ్ళు లేవు. అప్పుడే అన్ని పుస్తకాలు. అంతంత హోంవర్క్. స్కూలంటే భయపడి ఏడవక ఏం చేస్తుంది. కొంపలు మునిగినట్లు మూడో ఏటనే స్కూల్లో చేర్పించి దాన్ని హడలగొట్టారు''

నాయనమ్మ వచ్చిందంటే శ్రీజకు మంచి సపోర్ట్ దొరికినట్లే. ఆమె ఉన్నన్ని రోజులు స్కూలుకు ఆట విడుపే. కోడలు బలవంతం చేసినా అన్నపూర్ణమ్మ ఊరుకోదు.

''రెండు రోజులు స్కూలు మానేస్తే వచ్చే కలెక్టరు పోస్టేమీ వెనక్కుపోదులే''

అత్తగారి మాటల దాడితో శ్రీజను స్కూలుకు పంపించే ప్రయత్నం మానుకుంటుంది సురేఖ.

ఇప్పటికే రెండు స్కూళ్ళు మారినా శ్రీజ పేచీ తగ్గలేదు. దానికి నచ్చిన స్కూలు దొరికితే బాగుండును అనుకుంటూ శ్రీజను బుజ్జగించటంలో మునిగిపోయింది సురేఖ.

★ ★ ★

మధ్యాహ్నం వేళ తీరిగ్గా కూర్చొని పేపర్ చదువుతున్న సురేఖ దృష్టి ఒక ప్రకటన మీద ఆగిపోయింది. అది ఒక స్కూలుకు సంబంధించినది-

''మా 'ఆల్ ఇన్ వన్' స్కూల్లో మీ పిల్లలను చేర్పించి వారికి బంగారు భవితను అందించండి. మీ పిల్లలు ఏ రంగంలో స్థిరపడదలిచినా మా 'ఆల్ ఇన్ వన్'లో చేర్పించండి. డాక్టరు, యాక్టర్, ఇంజనీర్, ఐ.ఏ.యస్., ఐ.పి.యస్., రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు మీ పిల్లలు ఏది కావాలనుకున్నా 'ఆల్ ఇన్ వన్'లో చేర్పించండి.

హాస్టల్ సౌకర్యం కలదు. ఒకసారి మా స్కూల్లో చేరిన పిల్లలు తిరిగి ఇంటికి వెళ్ళటానికి ఇష్టపడరు. మా విద్యావిధానం అంతగా వారిని ఆకట్టుకుంటుంది. అదే మా ప్రత్యేకత.

వివరాలకు సంప్రదించండి.

- - - - - -

- - - - - -''

ఇదీ ఆ ప్రకటన సారాంశం.

సాయంత్రం భర్త ఆఫీసు నుండి రాగానే ఆ ప్రకటనను చూపించింది సురేఖ.

''అందరూ ప్రకటనలు గొప్పగానే ఇస్తారు'' అంటూ తేలిగ్గా తీసిపడేశాడు వరుణ్.

''అదికాదండి. పిల్లలు ఇంటికి రావటానికి ఇష్టపడనంతగా వాళ్ళ విద్యాబోధన ఉంటుందట. శ్రీజ రోజూ స్కూలుకు వెళ్ళనని పేచీకదా'' అంటూ నసిగింది.

''సరే, చూద్దాంలే'' అంటూ టి.వి. ఆన్ చేశాడు వరుణ్.

★ ★ ★

శ్రీజ పేచీ, భార్యామణి గోల భరించలేక ఒక శుభముహూర్తాన వాళ్ళని తీసుకొని 'ఆల్ ఇన్ వన్' స్కూలు ప్రాంగణంలోకి అడుగుపెట్టాడు వరుణ్.

వాచ్‌మేన్ నమస్కారం చేసి ఆఫీసు రూం చూపించాడు.

''నమస్తే'' అన్నాడు వరుణ్ అక్కడ ఆసీనుడైవున్న నడివయసు వ్యక్తిని చూస్తూ. అతడే 'ఆల్ ఇన్ వన్' డైరెక్టర్.

''కూర్చోండి'' అంటూ కుర్చీ చూపించాడా వ్యక్తి.

తనను తాను పరిచయం చేసుకున్నాడు వరుణ్.

''మా స్కూల్లో మీ పాపను చేర్పించాలనుకున్నారంటే మీరెంతో తెలివైనవారై ఉండాలి'' అంటూ ఒక అప్లికేషన్‌ను వరుణ్ ముందుకు తోశాడా వ్యక్తి.

దాంట్లో రకరకాల ఆప్షన్స్.

మీ పిల్లలు డాక్టర్ కావాలా!

సినిమా నటులు కావాలా!

ఇంజనీరు కావాలా!

రాజకీయ నాయకులు కావాలా!

వ్యాపారవేత్తలు కావాలా!

ఐ.ఏ.యస్, ఐ.పి.యస్‌లు కావాలా!

తెల్లగా అందంగా ఉండాలా

హైట్ పెరగాలా!

చక్కటి దంతసిరి కావాలా..

- - - - -

- - - - -

వరుణ్ తలగోక్కున్నాడు. చదువంటే చెబుతారు. అందం, రంగు వగైరాలన్నీ పుట్టుకతో వచ్చేవి. అవి ఇక్కడ నేర్పటం ఏమిటి?

''వాటిలో మీ పిల్లలు ఏ ఏ అంశాల్లో ప్రావీణ్యం సంపాదించాలో వాటి ఎదురుగా 'టిక్' పెట్టండి. మీరు ఎంచుకున్న అంశాలనుబట్టి ఫీజు ఉంటుంది.''


చెప్పాడు స్కూలు డైరక్టరు.

''ఏమండీ జుట్టు బాగా పెరగాలా! ఇంటర్నేషనల్ ప్లేయర్ కావాలా! అనే వాటి ఎదురుగా కూడా టిక్ పెట్టండి. అలాగే 'తెల్లగా ఉండాలా' ఎదురుగా కూడా''

వరుణ్‌కు అంతా అయోమయంగా ఉంది. సురేఖ భర్త చేతిలో నుండి పెన్ను లాక్కుని 'టిక్' పెట్టింది.

ఆమె టిక్ పెట్టిన అంశాలన్నీ చూసి చిన్నగా నవ్వాడు డైరక్టరు.

''వెరీగుడ్. మీ పాపమీద మీకెంత ప్రేమ ఉందో అర్థమైంది. మీ నమ్మకాన్ని మేము వమ్ము చేయం. వీటన్నిటికీ నెలకు నలభై వేలవుతుంది''




''నలభై వేలా'' నోరెళ్ళబెట్టాడు వరుణ్.

ఎల్.కె.జీ. చదువుకు అంత ఫీజా!

''మీరు ఎక్కువ అంశాలకు టిక్ పెట్టారు. కొన్ని తగ్గించండి. ఫీజు తగ్గుతుంది''

డైర్టక్టరు చెప్పిన మాటలు విని కొన్ని ఆప్షన్స్ కొట్టేసింది సురేఖ.

''ఒకటి, రెండు నెలలు ఉంచి ప్రోగ్రెస్ చూసి పాపను ఉంచాలా? వద్దా ఆలోచిద్దాం'' వరుణ్‌తో చెప్పింది సురేఖ. అయిష్టంగానే తలూపాడు వరుణ్.

''మేము రేపొచ్చి ఫీజులు కడతాం. మీ స్కూలు చూడొచ్చా'' అన్నాడు వరుణ్.

''రండి! మా విద్యాబోధన అందరికన్నా విభిన్నమైంది. అది పిల్లల్ని చక్కగా ఆకట్టుకుంటుంది'' అంటూ ముందుకు దారితీశాడు స్కూలు డైరెక్టరు. ఆయనను అనుసరించారు వరుణ్, భార్యాపిల్లలు.

ఒక తరగతి ముందు ఆగారు. గోడమీద 'ఇంటర్నేషనల్ ప్లేయర్స్' అన్న బోర్డున్నది. గదిలో ఉన్న పిల్లలకు కొంతమంది గ్లాసుల్లో ఏవో పోసి ఇస్తున్నారు.

''ఆ కంపెనీ డ్రింక్స్ తాగితే వాళ్ళు ఇంటర్నేషనల్ ప్లేయర్స్ అవుతారు'' చెప్పాడు 'ఆల్ ఇన్ వన్' డైర్టక్టరు.

ఆటస్థలం, పరికరాలు, శిక్షణ ఏమీ లేకుండానే కేవలం ఒక కంపెనీ ప్రొడక్ట్ సేవించటంవల్ల ప్లేయర్స్ అవుతారా ఆశ్చర్యపోవటం వరుణ్ వంతైంది.

మరో తరగతి గదిలోకి వెళ్ళారు. అక్కడ పిల్లలందరి తలలకు బాగా నూనె పట్టిస్తున్నారు కొంతమంది.

''ఇది లెక్కల క్లాసు. ఆ కంపెనీ కొబ్బరినూనె వాడితే లెక్కలు బాగావస్తాయి''

డైర్టక్టరు మాట విన్న తరువాత నోట మాట రాలేదు సురేఖకు.

అసలు అంకెలు కూడికలు తీసివేతలు ఏమీ నేర్పకుండానే కొబ్బరినూనె తలకు పట్టించగానే లెక్కలు వస్తాయా?

'భావి కలెక్టర్లు' అన్న బోర్డున్న గదిలోకి ఎంటరయ్యారందరూ. అక్కడ పిల్లలకు రకరకాల పిండివంటలు చేసి పెడుతున్నారు.

''లంచ్ బ్రేకా'' అడిగాడు వరుణ్.

''ఇది క్లాస్ అవరే! ఆ కంపెనీ నూనెతో తయారైన వంటలు తింటే కలెక్టర్లు అవుతారు''

కలెక్టరు కావటం ఇంత ఈజీనా.

వరుణ్‌కు కళ్ళు తిరుగుతున్నాయి. అదేమాట డైరెక్టరును అడిగాడు.

''చెప్పానుగా! మా విద్యావిధానం పూర్తిగా డిఫరెంటని''

ఆయన సమాధానం విన్న తరువాత ఏమీ మాట్లాడలేకపోయాడు వరుణ్.

పైకి ఏమీ అనలేకపోయినా అతనిలో సన్నగా వణుకు మొదలైంది.


మరోగదిలో పిల్లలకు ఒంటినిండా ఏవో క్రీంలు పట్టిస్తున్నారు.

''తెల్లటి శరీరఛాయ కోసం ఆ క్రీంలు వాడితే సరి. మీ అమ్మాయి కలరే అయినా అందులో జాయిన్ చేస్తే ఇంకా అందంగా తయారవుతుంది''

ఆల్ ఇన్ వన్ స్కూలు డైర్టక్టరు చెబుతున్న మాటలు వింటున్న సురేఖ ఆ పిల్లలను పరిశీలనగా చూసి జడుసుకున్నది. నల్లటి శరీరఛాయ కలిగిన ఆ పిల్లలు ఒంటినిండా తెల్లటి క్రీం పట్టించి ఉండటంతో పిల్లభూతాల్లా కన్పిస్తున్నారు.

''ఇలా అయితే ప్రపంచంలో నల్లటివాళ్ళే ఉండరేమో'' సందేహం వెలిబుచ్చిన సురేఖను చూసి జాలిపడ్డాడు స్కూలు డైర్టక్టరు.

''మీరు ఇంకా పాత తరంలోనే ఉన్నారు. ఇప్పటి టెక్నాలజీ మీకు అర్థం కావాలన్నా, మీకు తెలివితేటలు పెరగాలన్నా కొంత కాలం మా స్కూల్లో విద్యార్థిగా చేరండి. అద్భుతమైన జ్ఞానాన్ని సొంతం చేసుకోండి''



ఆయన మాటలు విని సురేఖ ఇంప్రెస్ అయి ఎక్కడ 'సరే'నంటుందోనని హడలిపోయాడు వరుణ్. అతని అదృష్టం బాగుండి సురేఖ తరువాత చూద్దాం అన్నది.

ఒకచోట పిల్లలందరికీ షాంపూ రుద్ది తలంట్లు పోస్తున్నారు.

''పిల్లలకు ఆయాలు శుభ్రంగా స్నానం చేయిస్తున్నట్లున్నారు'' మెచ్చుకోలుగా అన్నాడు వరుణ్. శ్రీజ ప్రస్తుతం చదువుతున్న స్కూల్లో ఆయాలు పిల్లలమీద కోపగిస్తారని విన్నాడు. అప్పుడప్పుడు శ్రీజ కూడా కంప్లైంట్ చేస్తుంటుంది. ఇక్కడ ఆయా

లన్నా మంచిగా ఉన్నారు అనుకున్నాడు మనసులో.

''వీళ్ళు ఆయాలు కారు. టీచర్సే. ఇది కేశ సంపద క్లాస్. ఈ షాంపూలు వాడితే జుట్టు ఎంత ఒత్తుగా వస్తుందంటే తల మీదకి పెద్ద బండరాయి విసిరేసినా అస్సలు నొప్పి అన్పించదు''

గర్వంగా చెబుతున్న డైరెక్టరు వంక భయంగా చూసింది సురేఖ. ఇదేమైనా మెంటల్ కేసేమో! అర్థంకాక ఆ పిల్లలను చూడటం మొదలుపెట్టింది.

ఆ పిల్లలెవరికీ తలమీద పట్టుమని పది వెంట్రుకలు లేవు. ఆ గదిలో నీళ్ళుపోయే తూము దగ్గర వెంట్రుకల కుప్ప అడ్డంపడి ఆ గది అంతా మడుగులా ఉన్నది.

''అమ్మా నా జుట్టు ఇంత పొడుగు కావాలి'' చేతులు బారజాపి అడుగుతున్నది శ్రీజ.

ష్..ష్..అంటూ శ్రీజ చెయ్యి పట్టుకుని బర బరా ముందుకు లాక్కుపోయింది సురేఖ.

కారు రేస, రన్నింగ్ రేస..లాంటి బోర్డున్న గదుల్లో కూడా కనీసం బొమ్మకారు కూడా లేదు. వాళ్ళకు డ్రైవింగ్ మెళకువలు వగైరా చెప్పటం లేదు. ఏవో పొడులు పాలల్లో కలిపి ఇస్తున్నారు. పిల్లలందరూ వయసుకు మించిన స్థూలకాయులుగా కనబడుతున్నారు. రన్నింగ్ రేసులా కాదుకదా! వాకింగ్‌లో కూడా పాల్గొనేలా కనపడలేదు వరుణ్‌కు.

''ఆ ప్రొడక్ట్ త్రాగితే వెయ్యి ఏనుగుల బలం, పిక్కల్లో సత్తువ వస్తుంది. రేసుల్లో వీళ్ళే ఛాంపియన్స్''

అంటూ మీసం మెలేశాడు 'ఆల్ ఇన్ వన్' స్కూలు డైరక్టరు.

'పిక్కల్లో బలం కాదు వచ్చేది క్రొవ్వు' అనుకుంటూ వెనుతిరగబోయాడు వరుణ్.

''మిగతావి కూడా చూసి వెళ్ళండి'' అంటూ చెయ్యి పట్టుకుని ముందుకు నడిచాడు డైరక్టరు.

బలిపశువును లాక్కుపోయినట్లు తనను లాక్కుపోతున్న ఆయనను నిస్సహాయంగా చూశాడు వరుణ్.

ఒకచోట కొంతమంది తల్లిదండ్రులు పిల్లలను ఇంటికి రమ్మని బ్రతిమాలుతున్నారు. కానీ వాళ్ళు ససేమిరా ఒప్పుకోవటం లేదు.

''ఒక్కసారి ఇంటికొచ్చిపోరా'' కన్నీళ్ళతో వేడుకుంటున్నాడు ఒక తండ్రి.

''నేను రాను. నాకు ఇక్కడే బాగుంది. ఇంటికొస్తే నువ్వు వేరే స్కూల్లో జాయిన్ చేస్తావు. చదవటం, హోంవర్క్ చేయటం నాకిష్టం లేదు'' మొండిగా చెప్పాడు కొడుకు.



ఇక్కడ చేర్పిస్తే తన కూతురు కూడా ఇంతేనా అనుకుంటూ కూతురి చేయి గట్టిగా పట్టుకున్నది సురేఖ.

''చెప్పానుగా! మా స్కూల్లో చేరిన పిల్లలు ఇంటికి వెళ్ళటానికి కూడా ఇష్టపడరని. మా విద్యావిధానం అంతగా ఆకట్టుకుంటుంది. కన్నవారినే మరిపిస్తుంటుంది'' గర్వంగా చెప్పాడు 'ఆల్ ఇన్ వన్' స్కూలు డైరెక్టరు.

ఒక గదిలో పిల్లలందరూ ఒకరి మీద ఒకరు చేతికందినవి విసిరేసుకుంటూ బండబూతులు తిట్టుకుంటున్నారు.

''ఈ రోజు మనం కొత్తరకం తిట్లు నేర్చుకుందాం'' వీళ్ళకు తిట్లు నేర్పుతున్నాడో యువకుడు. పిల్లలందరూ ఆ తిట్లను పెద్దగా వల్లె వేస్తున్నారు.

''వీళ్ళందరూ భావి రాజకీయ నాయకులు...'' అంటూ ఏదో చెబుతున్నాడు 'ఆల్ ఇన్ వన్' డైరక్టరు.

వరుణ్ తూలి ముందుకు పడబోయి గోడ ఆసరాతో నిలదొక్కుకున్నాడు. డైరక్టరు చేతుల్లో బందీగా ఉన్న తన చేతిని బలవంతంగా లాక్కుని శ్రీజను ఎత్తుకొని బయటకు పరుగులు తీశాడు. సురేఖ కూడా భర్తవెంటే పరుగులంకించుకొంది.

''మిస్టర్! మీరు చూడాల్సినవి ఇంకా చాలా ఉన్నాయి'' అంటూ వాళ్ళ వెంటపడ్డాడు ఆ స్కూలు డైరక్టరు.

''త్వరగా పరిగెత్తు...వాడు మనల్ని దొరకబుచ్చుకున్నాడంటే మెంటల్ హాస్పిటల్లో జాయిన్ కావాలి మనం''

భార్యను హెచ్చరిస్తూ శ్రీజ రానని మొండికేస్తున్నా వినకుండా గసపెడుతూ పరుగెడుతున్నాడు వరుణ్. స్కూలు ఆవరణ దాటి ఇవతలకు వచ్చినా పరుగుమాత్రం ఆపలేదు.

''నేను ఇంటికి రాను. ఈ స్కూల్లోనే జాయిన్ అవుతాను''

తన చేతుల్లో నుండి విడిపించుకోవటానికి ప్రయత్నిస్తూ ఏడుస్తున్న కూతుర్ని చూసి జుట్టు పీక్కున్నాడు వరుణ్.

★

## భలే చాన్స్

**దాదాపు ఐదారేళ్ల క్రితం 'శీను వాసంతి లక్ష్మి' సినిమాలో నటించిన పద్మప్రియ ఆ తర్వాత మలయాళ, తమిళ సినిమాల్లో నటిస్తూ బిజీగా వుందక్కడ. మళ్లీ ఇన్నాళ్లకి ఆమెకి తెలుగు ఇండస్ట్రీ నుంచి ఆహ్వానాలు అందుతున్నాయి. శర్వానంద్ హీరోగా 'అందరి బంధువయా' సినిమాలో నాయికగా నటిస్తున్న పద్మప్రియకి 'సుమధురం' సినిమాలో చాన్స్ రావడం నిజంగా అదృష్టంగానే చెప్పాలి. చాలా కాలం తర్వాత కె.విశ్వనాథ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అల్లరి నరేష్‌కి జంటగా నటిస్తున్న పద్మప్రియ కంటే ముందు ఆ పాత్రకి శృతి హాసన్‌ని అనుకున్నారు. చివరికి పద్మప్రియని వరించిందా చాన్స్.**